క్లుప్తంగా

మత్తుతో జీవితమే చిత్తు

చంద్రగిరి : మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఏ.రంగంపేటలోని పీజీ హాస్టళ్ల వద్ద నిర్వాహకులు, విద్యార్థులకు గంజాయి వాడకంతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ గంజాయికు విద్యార్థులు బానిసలుగా మారుతున్నారన్నారు. దీంతో ఉన్నత భవితకు దూరమవుతున్నారని చెప్పారు. అనంతరం పలు హాస్టళ్లలో తనిఖీలు చేపట్టారు. ప్రతి హాస్టల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కనీసం 30 రోజుల బ్యాకప్ ఉంచుకోవాలని ఆదేశించారు. గంజాయి విక్రయం, వాడకంపై ఎలాంటి సమాచారమైనా 100, 1972, 80999 99977 నంబర్లకు అందించాలని కోరారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితురాలికి చెక్ అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్ : శ్రీకాళహస్తిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ శశికుమార్ గత నెల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఈ మేరకు బాధిత కుటుంబీకులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆర్థిక సాయం అందించారు. మృతుడి భార్య రోహిణి ప్రియదర్శినికి రూ.లక్ష చెక్కు అందజేశారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రమేష్‌కుమార్



రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎస్‌వీ రమేష్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. నూతన ప్రిన్సిపల్‌ను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. 2024లో ఆయన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా పురస్కారం సైతం అందుకోవడం విశేషం.

ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

తిరుపతి తుడా : ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో సోమవారం ఆయుష్, యోగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈఎస్‌ఐ కార్పొరేషన్ సంస్థ 74వ ఆవిర్భావ మాసోత్సవాల్లో భాగంగా వస్త్ర దుకాణంలో పనిచేసే ఈఎస్‌ఐ లబ్ధిదారులు, సిబ్బందికి యోగా ఉపయోగాలను డాక్టర్లు వివరించారు. క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్ పి.రమేష్ కుమార్, ఆయుష్ డాక్టర్లు స్వప్న మంజరి, శ్రీలత, హెడ్ నర్స్ పి.సరస్వతమ్మ, వైద్య సిబ్బంది మంజుల, హేమలత, జయంతి, నరసింహులు, ఇందిర పాల్గొన్నారు.

బేడీ సేవలు చిరస్మరణీయం



నరేంద్ర సింగ్ బేడీకి నివాళులర్పిస్తున్న వక్తలు

తిరుపతి కల్చరల్ : యంగ్ ఇండియా ప్రాజెక్టు అధ్యక్షుడిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఎన్ఎస్ బేడీ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం నగరంలోని యూత్ హాస్టల్‌లో నరేంద్ర సింగ్ బేడీ సంస్మరణ సభ నిర్వహించారు. నవజీవన్ సంస్థ కె.సహదేవయ్య, ఆర్‌పీఐ నేత పి.అంజయ్య, ఏపీవీవీయూ ప్రతినిధి పి.చెన్నయ్య, ప్రగతి సంస్థ ప్రతినిధి కేవీ.రమణ, కేర్ సంస్థ ప్రతినిధి డేవిడ్, రైజ్ సంస్థ నిర్వాహకుడు రామకృష్ణ, ఫోర్డ్ సంస్థ ప్రతినిధి లలితమ్మ పాల్గొని ఎన్ఎస్ బేడీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ అంటరానితనం, బాల్య వివాహాలు, మహిళలపై దాడుల నిర్మూలనకు అవిశ్రాంతంగా కృషి చేసిన ఎన్ఎస్ బేడీ స్వర్గస్తులవడం బాధాకరమన్నారు.బేడీ సతీమణి సోంజా బేడీ మాట్లాడుతూ సుమారు 55 ఏళ్ల గ్రామీణ పేదలతో పని చేస్తూ చివరి క్షణం వరకు వారి సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో ఐఆర్‌డీఎస్ గంగిరెడ్డి, విశ్వనాథ్, కుమారస్వామి, కుప్పయ్య, శాంతికుమారి, సి.రవి, శ్రీనివాసులు, లావణ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

తిరుపతి రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి తెలిపారు. సోమవారం తిరుచానూరు వద్ద రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్న 25 ద్విచక్ర వాహనాలు, ఆటోను సీజ్ చేశారు. రహదారి నిబంధనలు పాటించకుంటే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ సునీల్, ట్రాఫిక్ సీఐ భాస్కర్ నాయక్, ఎస్ఐ సాయి చౌదరి పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి వినతి

తిరుపతి రూరల్ : అవిలాల పంచాయతీ పరిధిలోని శ్మశానం వద్ద జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని సర్పంచ్ వెంకటరమణ కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందించారు. అవిలాల, లింగేశ్వర్‌నగర్, సాయినగర్ పంచాయతీలలో ఎవరైనా మరణిస్తే దాదాపు 7 కిలోమీటర్లు నడచివెళ్లి దహన క్రియలు చేయాల్సి వస్తోందన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. స్పందించిన అధికారులు సమస్యను నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు.

ఉల్లాసం



తిరుపతి స్మార్ట్ సిటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్ టోర్నీని ఎస్వీయూ వీసీ అప్పారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులు పోటీ పడుతున్న క్యారమ్స్ టోర్నమెంట్ మేధోశక్తికి పెంపొందించుకునేందుకు తోడ్పడుతుందన్నారు. అనంతరం కాసేపు ఉల్లాసంగా క్యారమ్స్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఏపీ సర్కిల్ పోస్ట్ మాస్టర్ జనరల్ ప్రకాష్, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీస్ సంతోష్ నేత, అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ బి.నరసప్ప పాల్గొన్నారు.
– తిరుపతి సిటీ

ఉత్సాహం







పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల ఫ్లాష్ మాబ్ కార్యక్రమం అలరించింది. సోమవారం వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదురుగా విరించి–2025లో భాగంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్సాహంగా చేసిన డ్యాన్స్ వీక్షకులను మంత్రముగ్ధం చేసింది. వీసీ ఉమ మాట్లాడుతూ విద్యార్థినులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రిజిస్ట్రార్ రజిని, కళాశాల డైరెక్టర్ పి.మల్లికార్జున, కో–ఆర్డినేటర్లు వింధ్య, నర్మిత, భాను ప్రశాంతి పాల్గొన్నారు.
– తిరుపతి సిటీ

బరితెగింపు

అధికారమే అండగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రతిరోజూ నిరంతరాయంగా మట్టిని తవ్వేస్తున్నారు. పదుల సంఖ్యలో టిప్పర్లతో అక్రమంగా తరలించేస్తున్నారు. నకిలీ పత్రాలతో అనుమతులున్నాయని అందరినీ నమ్మిస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. అన్నీ తెలిసిన అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రావెల్ దందాకు పరోక్షంగా సహకరిస్తున్నారు. అక్రమార్జనకు తమ వంతు సాయం అందిస్తున్నారు.

- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- నకిలీ పత్రాలతో పట్టపగలే తరలింపు
- పట్టించుకోని అధికారులు



మండపంపల్లెలో యంత్రంతో గ్రావెల్‌ను నింపుతున్న దృశ్యం

చంద్రగిరి : మండలంలో ఇన్నాళ్లు చీకటి దందాగా సాగిన గ్రావెల్ అక్రమ రవాణా ఇప్పుడు పట్టపగలే నిరంతరాయంగా జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అక్రమార్కులు బరితెగించేశారు. నిత్యం అక్రమంగా మట్టిని తవ్వేస్తూ పదుల సంఖ్యలో టిప్పర్లతో తరలించేస్తూ.. రూ.లక్షలు వెనుకేసుకుంటున్నారు. గ్రావెల్ దందాలో భాగంగా మడపంపల్లెలోని ఓ పొలంలో కొద్ది రోజులుగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. భారీ ఎక్స్‌కవేటర్‌తో మట్టిను తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

రోజూ వందలాది లోడ్లు..

మండపంపల్లె నుంచి ప్రతి రోజు సుమారు 10 టిప్పర్లలో వందలాది లోడ్లు ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి పరిసరాల్లోని ఇటుక బట్టీలు, వెంచర్లు, ప్లాట్ల యజమానులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీకు చెందిన ఓ నేత కనుసన్నల్లో మొత్తం దందా నడుస్తున్నట్లు సమాచారం.



పొలంలోని విద్యుత్ స్తంభం కూల్చేసి మరీ..

కన్నెత్తి చూడని అధికారులు

గ్రావెల్ దందాలో నకిలీ పత్రాలను చూపించి తనకు అనుమతులు ఉన్నాయంటూ సదరు టీడీపీ నేత అందరినీ బురిడీ కొట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మట్టి తవ్వకాలను అడ్డుకోవడంలో మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రావెల్ అక్రమ రవాణాలో కొందరు అధికారులకు రోజువారీ మామూళ్లు అందుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈ దందాపై ఫిర్యాదు రావడంతో పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారు. తీరా అది అధికార పార్టీ నేతకు సంబంధించిందని తెలియడంతో వెనక్కుతగ్గినట్లు సమాచారం.

యథేచ్ఛగా బెదిరింపులు

అక్రమ గ్రావెల్ తవ్వకంపై ఓ విలేకరి (సాక్షి కాదు) సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో సదరు నేత వెంటనే ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిసింది. మా బంధువుల పొలంలో మట్టిని తవ్వుకుంటే నీకేం సంబంధమని నిలదీసినట్లు ఆడియో రికార్డులు సోషల్ మీడియాలో వైరల్ కావడం గమనార్హం.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

గ్రావెల్ దందాపై ఫిర్యాదులు అందాయి. వాటికి సంబంధించి అనుమతులు ఉంటే పత్రాలు సమర్పించాలని కోరాం. ఇప్పటి వరకు ఎటువంటి పత్రాలు ఇవ్వలేదు. గ్రావెల్ అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రకృతి సంపదను కొల్లగొట్టే వారిని ఉపేక్షించేది లేదు. వాహనాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

పారిశుద్ధ్యం.. తొలి ప్రాధాన్యం

తిరుపతి తుడా : నగరంలో పారిశుద్ధ్య పనులకే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. సోమవారం ఉదయం టీపీ ఏరియా, నెహ్రూ వీధి, గ్రూప్ థియేటర్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, విష్ణు నివాసం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా సంచరించే రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చించాలన్నారు. హోటళ్ల వద్ద తడి, పొడి చెత్త సేకరణను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాల అనుమతులు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈలు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

గ్రీవెన్స్‌కు 52 వినతులు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 52 వినతులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఫోన్ ద్వారా 18 మంది తమ సమస్యలు తెలుపగా, 34 మంది నేరుగా వచ్చి అర్జీలు సమర్పించినట్లు వివరించారు. ఆయా వినతులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎంఈ గోమతి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద గ్రామీణ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు డీడీయూ, జీకేవై స్కిల్స్ అకాడమీ హెడ్ ఎంవీ.మురళీమోహన్ తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మూడు నెలల వ్యవధి గల కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రెస్టారెంట్ క్యాప్టెన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్లలోపున్న గ్రామీణ యువకులు అర్హులన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇస్తామని, వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 5వ తేదీలోపు కాకతీయ నగర్, ఎస్‌బీఐ హాలిడే హోమ్, తిరుపతి చిరునామాలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 9391810079లో సంప్రదించాలని కోరారు.

24 వాహనాలు సీజ్

తిరుపతి క్రైమ్: నగరంలో సరైన డాక్యుమెంట్లు లేని 24 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి సోమవారం తెలిపారు. నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 17 ద్విచక్ర వాహనాలు, ఆరు కార్లు, ఒక జేసీబీకి రికార్డులు లేనట్లుగా గుర్తించమన్నారు. వీరందరికీ కూడా నూతన అమైన్మెంట్ చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామన్నారు.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న డీఎస్పీ రామకృష్ణాచారి

25న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్:తిరుపతి నగరం తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గల ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో మోటరోలా కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. ఆ సంస్థలో మొబైల్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 93922 75861లో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఉద్యోగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. విశ్రాంత అధికారుల షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సుధాకర్‌రావు విజయం సాధించగా నాగేశ్వరరావు రన్నరప్‌గా నిలిచారు. షటిల్ డబుల్స్ పోటీల్లో నాగేశ్వరరావు, సుధాకర్ జట్టు విజేతగా నిలవగా, మునికృష్ణయ్య, రవి ప్రభాకర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విశ్రాంత మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్‌లో లలితమ్మ విజేత కాగా, సుమతి రెండోస్థానం దక్కించుకున్నారు. డబుల్స్ షటిల్స్ పోటీ విభాగంలో లలితమ్మ, సుమతి జట్టు విజేత కాగా, భారతి, ప్రభావతమ్మ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ప్రత్యేక ప్రతిభావంతుల షటిల డబుల్ విభాగంలో సునీల్‌కుమార్, రెడ్డెప్ప జట్టు విజయం సాధించగా, హరిప్రసాద్, సాయిప్రసాద్ జట్టు రన్నరప్‌గా నిలిచారు. షటిల్ సింగిల్ విభాగంలో సునీల్‌కుమార్ విజయం సాధించగా హరిప్రసాద్ రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్ విభాగంలో సంపూర్ణమ్మ విజయం సాధించగా, నాగలక్ష్మి రన్నరప్ నిలిచారు. పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్ సింగిల్‌లో కిరణ్ విజయం సాధించగా, నాదముని రన్నరప్‌గా నిలిచారు.



బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో పోటీ పడుతున్న టీటీడీ ఉద్యోగులు

ఇదెక్కడి న్యాయం?

తిరుపతి తుడా : నగర పాలక సంస్థలో హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతిని కొందరు అడ్డుకోవడంపై దళిత, ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. సీనియారిటీ ప్రకారం రావాల్సిన ప్రమోషన్‌ను ఇవ్వకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. వివరాలు..కార్పొరేషన్‌లో ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించే బాధ్యత నిబంధనల ప్రకారం స్టాండింగ్ కౌన్సిల్‌కు ఉంటుంది. కమిటీ లేనప్పుడు కౌన్సిల్ తీర్మానమే శిరోధార్యమవుతుంది. విద్యార్హతలు, సీనియారిటీ ప్రకారం ఫిబ్రవరిలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో చివరి అంశంగా హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీదేవికి ఉద్యోగోన్నతిని అజెండాలో చేర్చారు. తీరా చర్చకు వచ్చినప్పుడు ఓ కార్పొరేటర్ అడ్డుకున్నారు. ఆయన సీనియారిటీ జాబితాలో రెండో స్థానంలో ఉన్న గోపీనాథ్‌కు పరోక్షంగా మద్దతు పలుకుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో దళిత ఉద్యోగి ప్రమోషన్‌ను కుట్రపూరితంగా అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ఉద్యోగ, దళిత సంఘాలు రెండు రోజులుగా ఈ అంశంపై చర్చిస్తున్నాయి. దళిత ఉద్యోగి ప్రమోషన్ ను అడ్డుకుంటున్న వారిపై ఎస్పీకి సైతం ఫిర్యాద చేశాయి. వారిపై మానవ హక్కుల ఉల్లంఘనతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.



నగరపాలక సంస్థ కార్యాలయం

స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్‌దే తుది నిర్ణయం

నగరపాలక సంస్థలోని హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతికి సంబంధించి స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ లేనందున, కౌన్సిల్‌లోని సభ్యుల అభ్యర్థన మేరకు తీర్మానం వాయిదా వేశామని వివరించారు.

అక్రమ మైనింగ్‌పై ఆందోళన

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లి సిద్ధేశ్వర ఎస్టీ కాలనీ వద్ద అక్రమ మైనింగ్ ఆపేయాలని గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. గనులు, రెవెన్యూ శాఖల అధికారులు అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వృద్ధులకు అన్నదానం

తిరుపతి కల్చరల్ : గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేశవాయనిగుంటలోని జాస్మిన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులు, బాటసారులకు సోమవారం అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురామిరెడ్డి, కార్యదర్శి తోట చక్రపాణి, నేతలు షాబుద్దీన్, విజయభాస్కర్‌రెడ్డి, ఎ.గోపీయాదవ్, ఉదయగిరి కృష్ణమూర్తి, బండి మధుసూదన్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు సునీల్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

పాకాల : మండల పరిషత్ కార్యాలయంలో నేడు వివిధ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. సోమవారం ఆమె మాటాడుతూ కాపు, ఈబీసీ, రెడ్డి, కమ్మ, వారికి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.దరఖాస్తుదారులు మంగళవారం ఉదయం 11 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

శాస్త్రోక్తంగా బాలాలయం

తిరుపతి కల్చరల్ : అలిపిరి పాదాల మండపం వద్ద శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా బాలాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోదా దేవి ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. డిప్యూటీ ఈవో శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, వైఖానస ఆగమ సలహాదారుడు సీతారామాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి

తిరుపతి సిటీ : ఎస్వీడబ్ల్యూ కళాశాలలో లోకమాత దేవి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సామాజిక సంవర్ధన జాతీయ కన్వీనర్ శ్యాంప్రసాద్, పిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ విచ్చేసి అహల్యాబాయి హోల్కర్ జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. అలాగే మహిళా వర్సిటీలో అహల్యాబాయి జయంతి జరుపుకున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డి ఉమాదేవి మాట్లాడుతూ మహారాణి అహల్యాబాయి జీవిత విశేషాపై విద్యార్థినులకు అవగాహన కలిగించారు.

స్విమ్స్‌లో కలెక్టర్‌కు వైద్యం

తిరుపతి తుడా : స్విమ్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం అడ్మిట్ అయ్యారు. పరీక్షించిన వైద్యులు ఆయన కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. చిన్నపాటి శస్త్ర చికిత్స చేసి కిడ్నీలో రాళ్లు తొలగించారు. సాయంత్రం ఆయనను డిశ్చార్జ్ చేశారు.

'వీల్‌చైర్'పై సేవలు



ఆస్పత్రికి వచ్చా.. లోపలికి వెళ్లేదెలా!



దేవుడా.. మా పరిస్థితి ఏంటి?



నా చైర్ నేనే తెచ్చుకోవడం మంచిదైంది..
(ఇన్‌సెట్) చివరకు చెత్త తరలింపునకు వాడుతున్నారు!

రాయలసీమకే తలమానికమైన తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో సేవలు మొక్కుబడిగానే ఉంటున్నాయి. కనీసం వీల్‌చైర్లు కూడా అందుబాటులో లేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. సదరన్ వెరిఫికేషన్ వచ్చే విభిన్నప్రతిభావంతులకు రుయాలో సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ఇక ఓపీ కోసం వచ్చేవారికి పట్టపగలే చుక్కలు కనపడుతున్నాయి. ఆస్పత్రి ప్రాంగణంలో వీల్‌చైర్లు లేకపోవడంతో వివిధ విభాగాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి